నేటినిజం
సాహితీ కెరటాలు
website: www.netinijam.com



## ప్రజల కొరకు నాయకుడు

చేపకి దాహం వేయదు
అది నీళ్లలోనే ఉంటుంది కనుక
పక్షికి నడక భయముండదు
అది గాలిలోనే ఎగురుతుంది కనుక
సింహానికి బయముండదు
అది మృగాల మధ్యనే ఉంటుంది కనుక
కట్టెకు కాలిపోతాననే భయం లేదు
దాని గర్భంలోనే అగ్ని ఉంటుంది కనుక
గుట్టకు కూలిపోతాననే భయం లేదు
దాన్ని మోస్తున్నది బలమైన ధరిత్రికనుక
నింగికి పడిపోతాననే భయం లేదు
దానికి అన్నివస్తువులూ నేస్తాలు కనుక
నేలకు ఆగిపోతాననే భయం లేదు
అనంతశక్తి తనను త్రిప్పుతుంది కనుక
నిజమైన నాయకునికీ భయం లేదు
ప్రజల కొరకే వాళ్ల మధ్య ఉంటాడు కనుక.



- ఆచార్య మసన చెన్నప్ప
సెల్: 9885654381

## నీవు సల్లగుండాలె



(వచన కథా కావ్యం-4)

పేరెవరు పెట్టినారో
మహానుభావునికి ...
సుదర్శనం!
మనిషే చక్రంగా మారి
బతుకుతాడని
పేరు పెట్టినోళ్ళకు మాత్రం
ఏమెరుక?
చేతిలో చక్రం
బుర్రలో చక్రం
కాళ్ళలో చక్రం
నడిపే బండికి షట్చక్రాలు !
చక్రం ప్రగతికి గుర్తన్నారు కానీ
అస్థిరతకూ అది అద్దమని
ఎంతమంది గుర్తిస్తారు.
ఈ సార్థక నామాన్ని కాదని,
ఎన్నటికీ పొసగని ' దర్శన్' అనే పొట్టి పేరును,
ముద్దు పేరును
మెడలో తగిలించుకొని తిరుగుతుంటాడు!
భరిస్తేనే కదా భార్యా భర్త !
మరి ఇద్దరి భారాన్నీ ఒకరే భరిస్తుంటే
ఏమనాలి?
తెలుగులో పొసగని సంస్కృత సమాసంలా
ఆమె
బతుకు బండిని నిరంతరాయంగా
గుంజుకుంటూ వస్తున్నది...
ఏనుగు మోత - ఏనుగు మేత వంటి
ఆయన భారాన్ని
మౌనంగా భరిస్తున్నది !
అతనితో నాలుగు వసంతాల జీవితంలో
నలభయ్యేళ్ళ అనుభవాలను పోగుచేసుకున్నది !
ఇంక ఈ జీవితం తన వల్ల కాదు.
ఇంతకంటే చావైనా, బతుకైనా
ఒంటరిగానే సాగిపోవడం మేలనుకుంటున్న తరుణంలో...
ఇదిగో! ఇలా...
సంధిగ్ధతకు సడలని రూపంలా
సంసారానికి ప్రతిరూపమై అవతరించింది...
ఈ చిట్టితల్లి!
ఇది తమ ముడిని బిగిస్తుందో
చిక్కు ముడిని చేసి ఆడిస్తుందో....
ఆమె ఆలోచనలకు అడ్డుకట్ట వేసిందో స్పర్శ!
అది తనకు బాగా పరిచయమైంది...
ఒక్కసారి
ఒళ్ళు జలదరించి,
జలధరమైన కళ్ళు ధారాపాతంగా వర్షించినాయి.
ఊహకూ, అనుభవానికి మధ్యన పేరుకున్న
అడ్డు తెరను నిర్దాక్షిణ్యంగా చీలుస్తూ
స్పష్టంగా ప్రత్యక్షమైన 'సుదర్శనం'
కన్నీటి పొరల మధ్య నుండి కూడా
అతణ్ణి ఆమె స్పష్టంగా దర్శిస్తున్నది!
ఎందుకంటే
ఆమె చూస్తున్నది చర్మచక్షువులతో కాదు
మనో నేత్రంతో !
బెంగాలు వెళ్ళినవాడు ఇప్పట్లో రానేరాడని
బెంగటిల్లుతున్న ఆమె ఆలోచనలను
తలకిందులు చేస్తూ.... అతను !!!
కలో, నిజమో తేల్చుకోలేని స్థితిని
అతని మోటు సరసం పటాపంచలు చేసింది.
మెత్తని గాయమైన బుగ్గను.
మొత్తంగా పులకించిన మనసును
సమాయత్తం చేసి, అతణ్ణి చూసింది !
నిజమే!!
అతడు నిజంగా నిజం!
'బెంగాలు ప్రయాణాన్నే కాదు,
అటువంటి ఉద్యోగాన్ని వదిలేసి వచ్చిన !'
అంటున్న అతని మాటల్ని వింటూ
మరోమారు పులకించి.
గుండెలో గువ్వగా మారి పోయింది.
ఆలు బిడ్డలను ప్రేమతో ఆలింగనం చేసుకొని
ఆనందాశ్రువులు రాల్చాడు.
సుదర్శన !
ఈ దృశ్యం కనులార చూస్తున్న
అత్త- అమ్మ కాని అత్తమ్మ
'సల్లంగుండుండి బిడ్డ ! ' అని
మనసారా కోరుకున్నది!



-దోరవేటి
సెల్:9866251679

సిద్దిపేటలో వెన్నెల సాహితీ సంగమ వార్షికోత్సవ సభ
యార్లగడ్డ 'పచ్చికడుపు వాసన'కు పురస్కారం

# కవులకు ప్రత్యేక గౌరవాన్ని ఇచ్చేవి అవార్డులే

-ప్రముఖ కవి యార్లగడ్డ

కవులకు ప్రత్యేక గౌరవాన్ని ఇచ్చేవి అవార్డులేనని ప్రముఖ కవి, యార్లగడ్డ రాఘవేంద్రరావు అన్నారు. ఆదివారం సాయంత్రం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నరసింహారెడ్డి అధ్యక్షతన వెన్నెల సాహితీ సంగమవార్షికోత్సవం సభ నిర్వహించారు. ఈ సభలో యార్లగడ్డ రాఘవేంద్రరావు రచించిన '**పచ్చికడుపు వాసన**' అనే కవితా సంపుటికి పురస్కార అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పచ్చికడుపు వాసన' సంపుటిలోని కవితలను మానవ సంబంధాలు, సామాజిక అంశాలు, ప్రాకృతిక ప్రేరణ వగైరాలతో రచించానని తెలిపారు. చైతన్యానికి స్ఫూర్తి అయిన సిద్దిపేటలో ఈ అవార్డును తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. వర్తమాన కవులకు అవార్డులిస్తే కవితలపై మరింత ఆసక్తి కలుగుతుందన్నారు. కవులను ప్రోత్సహించడంలో వెన్నెల సాహితీ సంగమం కీలక పాత్రను పోషిస్తోందని ఆయన అభినందించారు. కనిపించకుండా వినిపించే వారే కవులు అని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కవి ఆప్కారీ సూర్యప్రకాశ్ అన్నారు. కవులకు అవార్డులు గొప్ప పురస్కారాలని, అవార్డు ఇవ్వడం తేలిక కానీ నిర్వహించడం కష్టమైన పని అని ఆయన చెప్పారు. అనంతరం గాలిరెడ్డి రచించిన 'పదహారేళ్ల' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పలువురు కవులకు జీవన సాఫల్య అవార్డులను అందజేశారు. వెన్నెల సాహితీ సంగమ గౌరవ అధ్యక్షులు రామచంద్రరావు, గాలిరెడ్డి, మహ్మద్‌పాషా, అశోక్, మహేష్, మల్లారెడ్డి పాల్గొన్నారు.



యార్లగడ్డ రాఘవేంద్రరావుకు పురస్కారం అందజేస్తున్న కవి సూర్యప్రకాశ్, వెన్నెల సాహితీ సంగమం ప్రతినిధులు.

# గణతంత్ర దినోత్సవ ప్రత్యేకత

భారతదేశ చరిత్రలో జనవరి 26, 1950వ సంవత్సరం భారతీయులందరం గుర్తు పెట్టుకోవాల్సిన అతి ముఖ్యమైన రోజు. 200 సంవత్సరాలపాటు బ్రిటీష్‌వారి పరిపాలనలో మగ్గిన మన దేశానికి మన దేశానికి ఆగస్టు 15, 1947న స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటివరకూ మనదేశ పరిపాలనా విధానం పూర్తిగా బ్రిటీష్ రాజ్యాంగం ప్రకారం జరిగేది. వారిని మనదేశం నుంచి వెళ్లగొట్టిన తరువాత మన దేశాన్ని మనమే పరిపాలించుకునేందుకు ఒక రాజ్యాంగాన్ని తయారు చేసుకోవాల్సి వచ్చింది.

అలా.. 1950, జనవరి 26న రాజ్యాంగం నిర్మించబడి, డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ మొట్టమొదటి రాష్ట్రపతిగా, భారతదేశం పూర్తి గణతంత్ర దేశం అయ్యింది. ఆ రోజు నుంచి భారతదేశం పూర్తిగా ప్రజా ప్రభుత్వంగా రూపుదిద్దుకుంది. గణతంత్ర రాజ్యం అంటే.. ప్రజలే ప్రభుత్వము, ప్రభుత్వమే ప్రజలు అని అర్థం.

కాగా.. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారత రాజ్యాంగాన్ని తయారు చేసేందుకు ఎంతోమంది మేధావులు, ఎన్నో దేశాల రాజ్యాంగాలను పరిశీలించారు. ఎన్నో రకాల అంశాలతో చాలాకాలంపాటు రాజ్యాంగ ఏర్పాటుకు కృషిచేసి రూపొందించారు. రాజ్యాంగాన్ని తయారు చేసేందుకు డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు.

1947 ఆగస్టు 29న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఛైర్మన్‌గా రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఏర్పాటయ్యింది. అనేక సవరణల అనంతరం 1949 నవంబరు 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. రెండు సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల కాలంలో పూర్తి చేసిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా గుర్తింపు పొందింది.

## సాహస బాలలకు సలాములు

1950 జనవరి 26వ తేదీ నుంచి అమలుజరిపారు. ఆనాటి నుంచి భారతదేశము "సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర" రాజ్యంగా అవతరించబడింది. అప్పటినుంచి ఈరోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాము. ముఖ్యంగా మనదేశ రాజధాని ఢిల్లీ నగరంలో భారత రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఈ గణతంత్ర వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ముందుగా రాష్ట్రపతి దేశం కోసం ప్రాణాలర్పించిన నాయకుల గురించి ప్రసంగిస్తారు. ఆ తరువాత వివిధ రంగాలలో నిష్ణాతులైన విద్యార్థులకు పతకాలను అందజేస్తారు. అదే విధంగా ఈ రోజును పురస్కరించుకుని దేశ రాజధానిలోనూ, రాష్ట్ర రాజధానుల్లోనూ గొప్ప గొప్ప పెరేడ్‌లను నిర్వహిస్తారు. అనేక పాఠశాలల నుంచి వేలాదిమంది విద్యార్థులు ఈ పెరేడ్‌లలో పాల్గొంటారు.

దేశ రాజధాని న్యూఢిల్లీలోనే కాకుండా.. ఆయా రాష్ట్ర రాజధానుల్లోనూ, ప్రతి ఒక్క ఊరిలోనూ, ప్రతి ఒక్క పాఠశాలలోనూ జనవరి 26ను పురస్కరించుకుని జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తారు. ఈ సందర్భంగా భారతదేశ స్వాతంత్ర్యానికి కృషి చేసిన అమరవీరుల త్యాగఫలాలను కొనియాడుతూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేస్తారు. Republic Day: ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా 1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలన నుంచి విముక్తమై భారతదేశం స్వతంత్ర దేశమైంది. బ్రిటిష్ పార్లమెంట్ ఆమోదించిన 1947 భారత స్వాతంత్రం చట్టం కింద రాజ్యాంగ అధినేత గా 6వ జార్జి ప్రభువు, ఎర్ల్ మౌంట్ బాటన్ గవర్నర్ జనరల్ గాను మనకు స్వాతంత్ర్యం సిద్ధించింది. మన దేశానికి స్వతంత్ర రాజ్యాంగం ఆనాటికి లేనందున 1935 భారత ప్రభుత్వ చట్టం ఆధారంగా పాలన కొనసాగింది. దేశ రాజ్యాంగాన్ని రూపొందించేందుకు 1947 ఆగస్టు 28న రాజ్యాంగ నిర్మాణ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ అధ్యక్షునిగా బాబా సాహెబ్, అంబేద్కర్ బాధ్యతలు చేపట్టారు. రాజ్యాంగ ముసాయిదాను రాజ్యాంగ సభ (తాత్కాలిక పార్లమెంట్)కు సమర్పించగా,



దాదాపు రెండేళ్ల పాటు 308 మంది సభ్యులు విపులంగా చర్చించి, సవరణలు చేసి భారత రాజ్యాంగాన్ని తయారు చేశారు. దానిని ఇంగ్లీష్, హిందీ భాషలలో చేతిరాతతో తయారు చేసి 1950 జనవరి 24న సంతకాలు చేసి ఖరారు చేశారు.

అలా తయారైన రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజే "భారత గణతంత్ర" దినం 1950 జనవరి 26. చారిత్రాత్మకంగా ఈ రోజుకు ఉన్న ప్రాముఖ్యం దృష్ట్యా జనవరి 26వ తేది గణతంత్ర దినంగా ఎంపిక చేశారు. భారత స్వాతంత్ర్యం పోరాటానికి నాయకత్వం వహించిన 'భారత జాతీయ కాంగ్రెస్' 1930లో 'పూర్ణ రాజ్య' కోసం ప్రకటన చేసి ప్రతి సంవత్సరం జనవరి 26ను పూర్ణ స్వరాజ్య జయంతి దినోత్సవం జరపాలని జాతికి పిలుపునిచ్చింది. భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశమంతటా వాడవాడలా ప్రజలు జాతీయ పతకాన్ని ఎగురవేసి సంబరాలు జరుపుకొంటారు.

✸ స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణానికి రాజ్యాంగ సభకు పట్టిన కాలం: 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు.
✸ రాజ్యాంగ సభ 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశమైంది. ఇందులో 114 రోజులు రాజ్యాంగం రాయటానికే పట్టింది.
✸ రాజ్యాంగ రాతప్రతిని తయారుచేసే క్రమంలో రాజ్యాంగ సభ ముందుకు 7,635 సవరణ ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్కరించింది.
✸ భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న సభలో ఆమోదించారు. 1950 జనవరి 24న సభ్యులు ఈ ప్రతిపై సంతకాలు పెట్టారు. మొత్తం 284 మంది సభ్యులు సంతకాలు చేసారు.
✸ 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. ఆ రోజున రాజ్యాంగ సభ రద్దయి, భారత్ తాత్కాలిక పార్లమెంటు గా మారింది.
✸ 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల తరువాత కొత్త పార్లమెంటు ఏర్పడే వరకు ఈ తాత్కాలిక పార్లమెంటు ఉనికిలో ఉంది.
✸ మన రాజ్యాంగం యొక్క అసలు ప్రతులు రెండు మాత్రమే ఉన్నాయి, హిందీలో ఒక ప్రతి, ఇంగ్లీష్ లో ఒక ప్రతి ఉన్నాయి, ఆ ప్రతులు పాడవకుండా ఉండేందుకు హీలియం వాయువు నింపిన బ్రీఫ్‌కేసులలో పార్లమెంట్ భవనంలో భద్రపరిచారు, వాటి నకలును ఫోటో కాపీలు మాత్రమే మనకు అందుబాటులో ఉంటాయి.
✸ మన రాజ్యాంగం జనవరి 26వ తేది ఉదయం 10:18 నిమిషాలకు అమలులోకి వచ్చింది.
✸ 1930వ సంవత్సరంలో జనవరి 26వ తేదిని స్వాతంత్ర్య దినోత్సవం లేదా పూర్ణ స్వరాజ్ దినోత్సవంగా జరుపుకొనేవారు, అంటే ఆరోజున భారతదేశం పూర్తి స్వేచ్ఛ కోసం పోరాడడానికి నిర్ణయించుకున్న రోజు.

అలా తయారైన రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజే "భారత గణతంత్ర" దినం 1950 జనవరి 26. చారిత్రాత్మకంగా ఈ రోజుకు ఉన్న ప్రాముఖ్యం దష్ట్యా జనవరి 26వ తేది గణతంత్ర దినంగా ఎంపిక చేశారు. భారత స్వాతంత్ర్యం పోరాటానికి నాయకత్వం వహించిన 'భారత జాతీయ కాంగ్రెస్' 1930లో 'పూర్ణ రాజ్య' కోసం ప్రకటన చేసి ప్రతి సంవత్సరం జనవరి 26ను పూర్ణ స్వరాజ్య జయంతి దినోత్సవం జరపాలని జాతికి పిలుపునిచ్చింది. భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశమంతటా వాడవాడలా ప్రజలు జాతీయ పతకాన్ని ఎగురవేసి సంబరాలు జరుపుకొంటారు.



- రవిచంచల
8500330700

## వందే భారతం

ప: వందేమాతరమంటూ భారతాన్ని చుట్టేస్తూ
వంద మైళ్ళ వేగంతో పరుగులు పెడుతోందీ..(2)
చ1: మేకిన్ ఇండియా మెరుపులు మెరిపిస్తూ ఉందీ
దశ దిశలా దేశ ఖ్యాతి వెల్లి విరుస్తోందీ
కాలంతో పోటీ పడి కదలి పోతు ఉందీ
ప్రతీ క్షణం ప్రగతి రథం దూసుకు వెళ్తుందీ.!(వందే)
చ2:నా దేశం నా రైలని భరతజాతి
అంటోంది
మువ్వన్నెల జండాలను ముచ్చటగా ఊపుతోంది
విమానంలో ప్రయాణాన్ని తలపిస్తూ ఉందీ
విజ్ఞానపు వెలుగులనూ పంచి పెడుతు ఉందీ.! (వందే)
చ3: ఆధునికం,చురుకుదనం ప్రత్యేకత ఉందీ
రాజధాని, శతాబ్దీల నవతరమంటోందీ
చుట్టూరా తిరుగు సీట్ల చైర్ కారు ఉందీ
పెద్ద కిటికి అద్దాలతొ ముద్దులొలుకుతోంది.! (వందే)
చ4: ఆటోమేటిక్ తలుపులు,సీసీటీవీ కెమెరాలు
జీవ శూన్య ప్రదేశాలు,ధూమ మయం హెచ్చరికలు
సెన్సార్ తో నల్లాలూ, ఎలక్ట్రిక్ అవుట్లెట్ల
సాంకేతిక పరిమళాలు వెద జల్లుతు ఉందీ.! (వందే)
చ5:ఢిల్లీ నుండి వారణాసి,ఢిల్లీ నుండి కట్రా
గాంధీనగర్ టూ ముంబై,ఢిల్లీ నుండి ఉనా
చెన్నై నుండి మైసూరు,బిలాస్‌పూర్ టూ నాగపూర్
హౌరా నుండి జల్పైగురి,సికింద్రాబాద్ టూ వైజాగ్.!(వందే)
చ6: ఆకలంటు తెలియకుండ అన్నం పెడుతోంది
ఆగకుండ వైఫై తో ఆహ్లాదం పంచుతోంది
గంటల కొద్దీ సమయం తగ్గిస్తూ ఉందీ
సురక్షితంగ గమ్యాన్నీ చేరుస్తూ ఉందీ.!(వందే)



-పెసరు లింగారెడ్డి
9010292500

## మువ్వన్నెల జెండా...!!!

నేడెజాతి స్వేచ్ఛాపర్వము
భారతీయులకు సగర్వము
తరతరాల బానిసబ్రతుకు
తెగిపడినసంకెళ్లుసర్వము..!

స్వేచ్ఛ పొందిన భారతి
ప్రజలంత నివ్వ హారతి
గగనసీమన రెపరెపలు
మువ్వన్నెలవెన్నెలకాంతి..!

అల్లూరి విప్లవకెరటము
గాంధీజీఅహింసవాదము
నేతాజీ రణ బావుటా...
నెహ్రూజీశాంతిమంత్రము!

అంబేద్కరు రాజ్యాంగము
గణతంత్ర మేను పర్వము
పటేల్ దృఢ సంకల్పమే..
భరతప్రజస్వేచ్ఛాఫలము!

స్వరాజ్యమేజన్మహక్కు
పలికినసింహమేతిలకు
లాలలజపతురాయుడిల
పోరి తొలిగించెను చిక్కు!

గాంధీజీ సత్యాగ్రహము
సహాయపునిరాకరణము
పరుల పాలనకు పాతర
ఎగిసె త్రివర్ణ పతాకము...!!!

డెబ్బై మూడు వసంతాలు
భరతమాత సంతసాలు
అశోక చక్ర ధర్మమే
దేశరక్ష కెంత మేలు!

పంటపండెపచ్చదనము
పాడి వెల్గె తెల్ల దనము
త్యాగశక్తి కాషాయము
త్రివర్ణమయమైఎగురుము...!!!



-డా.గన్నోజు
శ్రీనివాసాచారి
8555899493

## యుద్ధం

బతకటం ఒక యుద్ధం
కులం కోసం కాదు.

బతకటం ఒక యుద్ధం
మనిషి మనిషి కోసం కాదు.

బతకటం ఒక యుద్ధం
ఆకలి కోసం కాదు.

బతకటం ఒక యుద్ధం
ఆవేశం కోసం కాదు

బతకటం ఒక యుద్ధం
పెత్తనం కోసం కాదు

బతకటం ఒక యుద్ధం
రక్త దాహార్తి కోసం కాదు

బతకటం ఒక యుద్ధం
శత్రువు మరణం కోసం కాదు.

బతకటం ఒక యుద్ధం
దేశం దాస్య శృంకళాల
విముక్తి కోసం పోరాటం కోసం
దేశ సౌభ్రాతృత్వం కోసం
వీరుడిలా పోరాట
యుద్ధం కోసం బతకటం...
జై హింద్....
జై హింద్...



-ఎలగొండ రవి
9848770345

## జనగణమణ

ప॥గగనానికి ఎగిసింది మువ్వన్నెల ఝుండా
హిమశిఖరాన మెరిసింది మువ్వన్నెల ఝుండా
గగనమే హద్దుగా.. కీర్తిశిఖలు అద్దగా.. ॥గగనానికి॥

॥ చ ॥కన్నవారినే కన్న పుణ్యభూమి నాదంటూ
ఆవేశం పౌరుషాల అగ్గిసెగలు రాజేసి
నాదేశం నాదంటూ దాస్యాన్ని తెగతెంచి
ఎగసి ఎగసి ఎగసి ఎగసి ఎగిరింది ఝుండా
హిమశిఖరాన ఎగిరింది మువ్వన్నెల ఝుండా
జనగణమణ జనగణమణ జనగణమణ .

భువనాన్ని శాసించే మేథస్సుకు మూలధనం
సాధించిన స్వాతంత్ర్యం పాలించే గణతంత్రం
భారతీయ ఖ్యాతి సకలజగతిన వెలుగొందగా
రెపరెపరెప రెపరెపరెప ఎగిరింది ఝుండా
ఎగసిఎగసి ఎగసిఎగసి ఆకాశం నిండా
జనగణమణ జనగణమణ జనగణమణ ..

జాతి మనది.. ఖ్యాతి మనది
కలిసినడుచు రీతి మనది
పసిడి భవిత బాటలోన కలిసిమెలిసి నడుద్దాం..
మహనీయులు కలలుగన్న భరతావని సాధిద్దాం..
జనగణమణ జనగణమణ జనగణమణ..

ఒకే జాతి భారతి..
ఒకే మతం భారతం..
ఒకే జాతి భారతి..
ఒకే మతం భారతం..
జనగణమణ జనగణమణ జనగణమణ.. ॥గగనానికి॥



- పేరిశెట్టిబాబు
9247170800



## సాల్యూట్ సైనికా

సైనికా! ఓ సైనికా!
మా కలం గళం మీ వెంటే..!

కన్నులగప్పి కాటేయ జూసే
చొరబాటుదారుల ఎత్తుజిత్తులకు
మీ గన్నులే మాకు వెన్నుదన్నులు...!

కొవ్వెక్కిమదమెక్కి
పగబట్టి చొరబడే
ఉగ్ర పంజాలను
ఉక్కుసంకల్పంతో
పరుగులు తీయించే ...
మీ శౌర్యధైర్యాల
రక్తతర్పణ ధార సింహనాదాలై
దేశరక్షణమేమో ధృడచిత్తభావమై
శతకోట్ల జీవాత్మ శ్రేయమే ధ్యేయమై
విద్యుక్తధర్మమే శిరోధార్యమకుటమై
త్రి కాలాలలో
త్రికరణ శుద్ధిగ
తీక్షణ చూపుతో
మంచు కొండల్లో
నివాసముంటు నిశాచరుల్లా
పరాయి దేశపు తురాయి బుద్ధిని
ఎప్పటి కప్పుడు అంచన వేస్తు
ఫిరంగి ధాటికి సరింగ నిలబడి
మందుగుండులు మరేవి వచ్చిన
శత్రు మూకను తరిమె ప్రతాపం...!

శతకోటాత్మల బంధుడవు
బలి మూకలకీశుడవు
మా పాలిట కేశవుడవు
భరతజాతికే ప్రణతుడవు..!

నా భారత జవాను
నీవే మాకు దివాను
నీ చేతిలో గన్నున్నది
మా చేతిలో పెన్నున్నది
నీ లక్ష్యం నీ ధ్యేయం
ఉత్తమోత్త కర్తవ్యం
గతి తప్పిన జనాలకు
దేశభక్తి ఏ పాటిదో...

భరత జాతి ఐక్యతకు
బాద్షావు నీవేనోయ్
దండలోని దారమల్లే
నీ దారే ఆదర్శం..!

జో కొట్టే జవానుడా
జై కొడతాం మేమంతా..!
నిన్ను తలచినంతనే
భావ యుక్తి పైకెగసి
అక్షరాలే అనునయంగ
పుష్పాంజలి ఘటిస్తాయి..!

మీ రక్తం ఏరులైతే
మా రక్తం సిరా చుక్క
ఆత్మార్పణ చేస్తాయి..
పెన్నుగ గర్జిస్తాయి..!

మిన్నొరిగినా,గన్నొరిగినా
మీ వెనుకే మా పెన్నులు
యువరక్తం నింపుకొని
నిటారుగా రొమ్ము విరిచి
కలం కదిలి జవానైత..!

నా గళమే ఓ దళమై
నా కలం త్రివిద దళం
భారతీయ బంధు దళం..!

సైనికుడా! సైరికుడా!
మీ కోసం మా ప్రార్థన !
మా యోచన మీ సలాం
మీ సేవే మా గులాం ...!

కలకాలం కలం బలం
మీ కోసం మేం రాస్తాం...!
గళమంతా మీ పాటే
గీతాంజలి మేమౌతాం...!

హృదినిండా కొలువున్నవు
మదినిండా నీ సేవోయ్!
జై జవాన్..! జై కిసాన్ ..!
జై విజ్ఞాన్ ..! జై భారత్..!



-డా.పాండాల
మహేశ్వర్
9912180054

## నేటి నిజం ముద్రాక్షర రూపంలో!

నేటి నిజం ముద్రాక్షర రూపంలో!
శ్వేత పత్రంపై ఆవిష్కృతమౌతున్న వేళ!
తరాల అంతరాలే కాదు అంతరంగాలు సైతం!
మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న వేళ!
స్వేచ్ఛ, స్వార్థాన్ని నిస్సిగ్గుగా మోస్తున్న వేళ!
మానవతా విలువలకు తిలోదకాలిస్తున్న వేళ!
పేదవాడి ఆక్రందన పెదవికి చేటైన వేళ!
మధ్యతరగతి మానసా లూ!
త్రిశంకుస్వర్గాన్ని తలపోస్తున్న వేళ!
విస్తుపోతున్న ఋతువులూ!
తమ గతుల్నీ సవరిస్తున్న వేళ!
మహనీయుల త్యాగ ఫలం!
నేడు అక్షరాలకే పరిమితమై నిలుస్తున్న వేళ!
ధర్మం,నీతీ,న్యాయం,సత్యం, శాంతి కి!
ఆలవాలమైన నా భారత భారతి!
నేటి జనత ను!
సమత మమత లతో!
దాతృత్వం,మంచి,మానవతలతో!
దేశ,దైవ భక్తులతో!
క్రమశిక్షణతో!
మీరంతా "సువర్ణభారతి" సఫలమయ్యే దిశగా!
పురోగమించండని పిలుపు నందిస్తోంది!
ధర్మం,నీతీ, న్యాయాలకు ప్రతీకగా!
మువ్వన్నెల పతాక రూపంలో!
నింగికెగసిన నా భారతమ్మ!
గగన వీధిన తేజోకిరణమై ప్రకాశిస్తోంది!
ఈ స్వాతంత్ర్య దినోత్సవ పర్వదిన శుభవేళ!



-దోస పాటి.సత్యనారాయణ మూర్తి
9866631877

## వాడు మనిషి

బాధలను చూసి పరితపించేవాడు,
కష్టాలను చూసి చలించిపోయేవాడు
కాల్చుకుని తినే కటిక దారిద్ర్యము నుండి
మనిషిని మూర్ఖులును చేసే అవిద్య నుండి
బయలుపడేందుకు తన వంతుగా రాత్రి పగలు
కృషిచేసేవాడు
ఎటువంటి ఆటంకములు, అవరోధములు
ఎదురైనా
వాటినంటిని అధిగమించి,
తను నమ్మిన సిద్ధాంతంనికి కట్టుబడి
తాను వెళ్లే దారిలో రాళ్లు వున్నా, ముల్లులు వున్నా
వాటిని సరిచేసుకుంటా, సవరించుకుంటు
నడుచుకుంటూ వెళ్లి,
సమాజాన్ని పట్టి పీడస్తున్న సామాజిక రుక్మతలపై
పోరాటం సల్పి
విజయాన్ని సాధించే వరకు

అవిశ్రాంతముగా ఓ ఉత్సాహం తో సాగేవాడు
వాడు నిజమైన మనిషి
ముందు నుండి తను నడుస్తూ,
వెనుక వారికి దారి చూపుతాడు
తాను కరిగి పోతున్న ఇతరుల జీవితాల్లో
వెలుగుపూలు పూయిస్తాడు
అలుపెరుగనిపోరాటం చేస్తూ
నిత్య నూత్నమై ప్రకాశిస్తాడు
ఆ మనిషి పాదాలకు వందనాలు చేద్దాం
ఆ మనిషి చేతలకు చేయూతనిద్దాం.



- విశ్వనాథ నరసింహం
సెల్: 9490971589

## శతాబ్దాలుగా'...నేను !

నా కళ్లల్లో..
ఒక స్వప్నం కదలాడుతూ ఉంది
నేను దానిని చూడలేదు
అయినా అది అక్కడే
కదులుతూ ఉంది శతాబ్దాలుగా..!

నా ఉదరంలో..
ఒక ఆకలి గంట మ్రోగుతూ ఉన్నది
నేను దానిని గ్రహించలేదు
అయినా అది అక్కడే
ధ్వనిస్తుంది శతాబ్దాలుగా..!

నా కాళ్లలో..
ఎంతో చెమట నీరు ఉంది
నేను దానిని చూడలేదు
అయినా అది అక్కడే
పారుతూ ఉంది శతాబ్దాలుగా..!

నా ఆత్మలో..
ఒక ఆశల నెచ్చెలి ఉంది
నేను దానిని గ్రహించలేదు
అయినా అది కూడా
ఆవిరై ఉంది శతాబ్దాలుగా...!

ఒక రోజు స్వప్నం చెదిరిపోయింది
ఒక పూట ఆకలి నశించిపోయింది
ఒక రాత్రి చెమటచుక్క ఆవిరై పోయింది
ఒక క్షణంలో ఆశలు నిరాశై చెదిరిపోయాయి
అయినా....!
రేపటి ఆశతో శిలనై మిగిలేవున్నా..!!



-డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

## కాలుష్యమా ఖబర్దార్ !

ఎక్కి ఎక్కి ఏడుస్తున్న ఓజోన్ పొరకు కన్న తల్లి అయ్యింది నా భావం, కౌగలించుకొని కన్నీరు తుడిచి ఓదార్చింది నా మమతల మధుర రాగం, కలి గొన్న పులి అయింది నా మనో బలం

కాలుష్యం జింకను వెంటాడి సజీవంగా తినేసింది. ఓజోన్ పొర కడుపు కాలిపోతుంటే ఒడిలో కూర్చో బెట్టుకొని ప్రేమ ముద్దలతో కాలే కడుపు నింపింది నా పేగు బంధం. సూర్య కిరణాలను ఓజోన్ పొరలతో జల్లెడ పట్టి భూమికి చిలకరించి మానవాళికి జీవం పోసింది జాలు పారే నా మానవత్వం. వెంటిలేటర్ పై ఉన్న ఓజోన్‌కు నాణ్యమైన చికిత్స చేయించి కొండంత బలం చేకూర్చింది సెలయేరులా దుమికే నా భావం.హరి చందనాలతో మంగళ స్నానం చేయించి ఇంద్ర ధనుస్సునే చీరలుగా కట్టించింది చెలరేగే నా ఉత్సాహం.

నా సంతోషం అలంకరించిన పల్లకి అయింది. ఓజోన్ ను కూర్చుండ బెట్టి అత్తరు చిలికించుతు మేళతాళాలతో నిండు పున్నమి వెన్నెలలో విశ్వమ్మంతా తిప్పింది గుభాలించే నా మనసు. ప్లాస్టిక్ రాక్షసులుగా రూపాంతరం చెంది వికృత చేష్టలతో పుడమి తల్లిని సామూహికంగా హత్యాచారం చేస్తుంటే నా ఊహలు రక్షణ కవచాలుగా చుట్టు ముట్టి వాటిని నిర్ధా క్షిణ్యంగా ఎన్కౌంటర్ చేసింది. అవని కి ఊపిరి పోసి శీలం కాపాడింది.

కాలుష్యము పంచభూతాల కాళ్ళకు చేతులకు ఉక్కు సంకెళ్లు వేసి కొట్టుకుంటూ ఈడ్చుకొని పోతుంటే అడ్డుతగిలి ఎదిరించి శృంఖలాలు పగులగొట్టింది. చెర నుండి విడదీసింది స్వేచ్ఛా వాయువులను ఇచ్చింది. కల్ప వృక్షమైన నా ఆలోచన. నా ఊహల తరంగాలు ఆటోమేటిక్ సాఫ్ట్ వేర్ సిస్టమ్‌గా తయారైంది,

మనిషి మేధస్సు లోకి చొచ్చుకొని పోయి కాలుష్యం సృష్టించకుండా చేసింది. ప్రకృతి పరవశించి ఆనంద నాట్యం చేసింది.

-పూసాల సత్యనారాయణ
9000792400

పుస్తక సమీక్ష

# ఏదీ నిత్యం కాదనేదే సత్యం

ఒక కవిగా, విద్యార్థులకు పాఠాలు చెప్పే ఆచార్యుడిగా, తండ్రి మక్కెన రామ సుబ్బయ్యగారి సంస్మరణలో సాహిత్యకారులకు గౌరవించే ఒక సాహితీ ప్రేమిగా ఆచార్య మక్కెన శ్రీను లోకానికి పరిచయమే! కొద్దికాలం నుండి వీరు తన దృష్టిని కథారంగంవేపు మళ్ళించినట్లు విశదమౌతుంది ఈ కథా సంపుటి గమనించాక.

ఏది సత్యం కథా సంపుటిలో 10 కథలున్నాయి. లోగడ ఇవి విశాలాక్షి, విశాఖ సంస్కృతి లాంటి ప్రముఖ మాసపత్రికల్లో, ప్రతిలిపి అనబడు అంతర్జాల పత్రికలో ప్రచురించబడి, సంపుటిగా ఇప్పుడు పాఠకులకు అందించబడుతున్నాయి. ప్రఖ్యాత కథకులు డాక్టర్ ఎం.సుగుణ రావు ఈ సంపుటికి ముందుమాటలో చెప్పినట్లుగా నిత్య జీవిత సత్యాలను తన కలం గళంతో తనదైన దృష్టితో రాస్తూ మనకందిస్తున్నారు. కాలంతో సాగుతూ వర్తమానంలో పయనిస్తూ ప్రతీ కథలోనూ ఒక ఉదాత్త సందేశాన్నిస్తూ, పాఠకులకు పరిచయం, చేయబడుతోన్న కథలివి. అనవసరపు వర్ణనలు చిన్నెలు వన్నెలకు పోకుండా, అర్థవంతమైన చిత్రాలను కూర్చి కథలకు మరింత పరిమళం ఈ రచయిత అద్ది అందిస్తున్నారు.




దాంపత్య జీవితంలో ఎన్నో ఏళ్ళు కలిసి ప్రయాణం చేసినా భార్యా భర్తల ఆలోచనలు వేరు వేరుగా ఉంటాయి. భర్త ఆలోచనలు ముందు పయనిం చాల్సిన జీవనయానంపై ఉంటే, భార్య ఆలోచనలు తమ సంతానం మీద వారు కలుగచేయబోయే సంతృప్తి మీద ఉంటుంది. ఏం జరుగబోతుందో, ఎలా ఎదుర్కోవాలో అన్న ఆదుర్దా ఒకరిదైతే, పిల్లలున్నారు వారు చూసుకుంటారు అన్న ధీమా, నిశ్చింత మరొకరిది. 'తాతల కాలం నుండి వస్తోన్న ఈ భూమి. మా తాత, మానాన్న, నేను చెమట చింధించి పంట పండించిన ఈ ఆస్తిని కొడుకు అమ్మమంటున్నాడే అన్న బాధ ఒకరిది. కాలానుగుణంగా వచ్చే మార్పులను అనుసరించటం వారికి చేయూత నివ్వటమే మన కర్తవ్యం అంటూ విచక్షణా జ్ఞానాన్ని కలుగ చేస్తుంది భార్య. దాంపత్య సాంగత్యం లోని పరమార్థం ఇదేనంటూ చివరకు ఆ దంపతులిరువురు ఏకాభిప్రాయానికి రావటం **'సాంగత్యం''** కథలోని సారాంశం.

కడుపున పుట్టిన కూతురుకంటే అల్లుడే విచక్షణతో ఆలోచించి, కూతురి వేధింపుల నుండి అత్తగారిని ఆదుకుంటే, 'ముద్దు మురిపాలతో పెంచుకున్న (నా) కొండా దూరమైనా నాకు కొడుకులు లేనిలోటు తీర్చావయ్యా నా కొండా!' అని సంతోషిస్తుంది తల్లి సుగుణమ్మ 'దూరపు కొండలు' కథలో. ఇలాంటి సంఘటనలు సర్వసాధారణం కాకపోవచ్చు.

అసాధారణాలకు కూడా ఆకృతినిచ్చి కథలల్లటమే రచయిత తల ప్రత్యేకత. ఇట్టి ప్రత్యేకతను **'దూరపు కొండలు'**లో మనకు కనిపింపచేస్తారు శ్రీనుగారు.

బాస్ ఆదేశించాడని అవివేకపు పనికి పూనుకుంటాడు రాజశేఖర్. ఆచరణలోగాని అది ఎంతటి అవివే కమో తెలిసివస్తుంది. 'ప్రాణం పోయినా విలువ పోగొట్టుకోకూడదు. బ్రతికినన్నాళ్ళూ ధర్మంగ బతకాల' అన్న రిక్షావాలా, ముమ్మాటికీ 'మార్గదర్శి' ఎంత చిన్నవారు చెప్పినా నీతి గొప్పగానే ఉంటుందంటుందీ కథ.

వృత్తులు అదృశ్యం కాలేదు. అవి ఇంకా మనమధ్యనే ఉన్నాయి. స్థితిని మార్చుకున్నాయి. ఉదాహరణకు హాస్పిటల్ సేవలో చాకలి మంగలి లాంటి సర్వవృత్తులు న్యాయన్న సత్యం **'ఏది సత్యం'**లో చదువుతాము. మన కళ్ళెదుటే కనబడుతూ మనం గమనించని వైవిధ్యమైన సత్యాన్ని చూపారు రచయిత **'ఏది'** సత్యం కథలో. స్థితులు మార్చుకున్నా, సమాజం గతి తప్పలేదు అని నిరూపించే ప్రయత్నానికి రచయితకు అభినందనలు చెపాల్సిందే!

మిలిటరీలో చేరి దేశ రక్షణకు మనవంతు పాత్ర పోషిస్తే మాత్రమే దేశభక్తి అనిపించుకోదు. రైతు, కుమ్మరి, కమ్మరి, వైద్యం, వ్యాపారం అన్నింటినీ చిత్తశుద్ధితో నిష్కల్మషమైన చిత్తంతో ఏ వృత్తిని నిర్వహించినా అది దేశభక్తి క్రిందకు వస్తుంది అంటారు రచయిత మక్కెన శ్రీను 'దేశభక్తి కథలో. దేశానికి ప్రయోజనం చేకూర్చే ఏ పని అయినా, దేశభక్తి క్రిందకు వస్తుందన టం రచయితకున్న లోతైన విశ్లేష ణాశక్తికి నిదర్శనం.

**'విధి'** అవశ్యప్రాప్యంబు.. అద్దానినెవ్వరు తప్పించెదరు.. అన్న బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి హరిశ్చంద్రలోని పద్యం ఉదహరిస్తూ, అందున్న తాత్త్విక సత్యాన్నాధారం చేసికుని వ్రాసిన **"ఎవరు తప్పించ గలరు!"** అన్నకథ- ఏ నిమిషానికి ఏది జరుగునో ఎవరూహించెదరు అన్న సినిమా పాటను గుర్తుకు తెస్తుంది. అవును.. ఎప్పుడేమి జరుగుతుందో.. ఊహాతీతం. అంతా మంచే జరుగుతుందన్న భరోసాలోనే బ్రతుకు ఉంది. క్లుప్తత సారళ్యత సత్సందేశం ఉన్న కథలివి, రచయితకు అభినందనలు..

**ప్రతులకు:** డా॥ మక్కెన శ్రీను
టి.ఎఫ్-3, బొడ్డపాటి మ్యాన్షన్
బైబిల స్కూల్ ఎదురుగా, గుణదల
విజయవాడ-520 004
సెల్: 98852 1[illegible]



-కూర చిదంబరం
సెల్: 8639338675

## ఆడపిల్ల

ఆడజన్మ అక్షరాలకందని అద్భుతకావ్యం ,
అనంత సృష్టికి ప్రతిరూపం ,
ఆడపిల్ల మా ఇంటి మహా లక్ష్మి నాటి మాట ,
స్త్రీ పుట్టుకను నేరంగాభావించే భ్రూణ హత్యల
కాలం నేటి మాట ,
ఆడపుట్టుక లేక ఆది అంతంలేదు
అన్ననానుడి నగ్నసత్యం
ఆడదే జగతికి మూలం,
ఆప్యాయతాను రాగాలను పంచి ఇచ్చే
అనురాగమయి ,
పుట్టినింటిలో ఆడపడుచు
మెట్టినింటిలో గృహాలక్ష్మి ,
ఆలిగా భర్త ప్రేమను పొంది
తల్లిగా బిడ్డకు జన్మనిస్తుంది,
అన్నదమ్ముల వివాహ వేడుకల్లోనూ
పుట్టినింట పండగలు,
పబ్బాలకూ సంతోషాలను
తెచ్చి పెట్టేది ఆడపిల్లే ,
ఆడదే అవనికి ఆధారం ,
తమ ఔన్నత్యంతో
దేశాన్ని పరిపాలించిన స్త్రీ జాతికి
వన్నె...గౌరవాలను ఆపాదించిన
వీరవనితలూ ఒకింటి ఆడపడుచులే ,
ఆత్మస్థైర్యంతో పురుషులతో
సమానహోదాను దక్కించుకున్న
మహోన్నతులు ఆడపడుచులు ,
భరత మాతకు ముద్దు బిడ్డలు ఆడపడుచులు ,
సహనశీలియైన పుడమి తల్లికి
వారసులు ఆడపడుచులు,



-రాయవరపు సరస్వతి
7989665525

## ఈ క్షణాలు

ఇన్ని క్షణాల్ని ముత్యాల్లా
దొంపుకుని
చిన్ని కిటికీలోంచి
ప్రపంచాన్ని తెరుచుకుని
సమయాల్ని అలంకరించుకుంటాను.

జ్ఞాపకాలు పావురాల్లావాలతాయి.
మంచు దృశ్యాలు పరచుకుంటాయి.

రాత్రులు వేలాడుతూ
స్వప్న లోకంలో
ఆశల్ని రుచిచూపుతాయి.

మౌన క్షేత్రాలు
మనసుని తేలిక పరుస్తాయి.

ప్రణాళికలు
మనిషిని క్రమబద్ధీకరిస్తాయి.

ఉత్సాహాలు మేల్కొని
ఆరోగ్యమయ ప్రపంచంలో
విజయ తీరాలని చేరుస్తాయి.

నిరంతర శ్రమ
పరిశ్రమ ఆత్మ విశ్వాసాన్ని నిలిపి
చెదిరిపోని కలల్ని
దృశ్యాలుగా ఆవిష్కరించి నిలుపుతుంది.



- గవిడి శ్రీనివాస్.
7019278368
9966550601

## గురుజాడలు

జనం కోసం జాగృతి కొరకు
కలం ఖడ్గం కదిలిందిమరి
మనసు తాకెడి భావ సుమాలు
నేడు కూడా వాడ వాడలు.



- రేడియమ్
సెల్: 9291527757

## ఏది మానవత్వం?

సూర్య గమనమాగదెపుడు
భూ భ్రమణం సాగునెపుడు
మానవతం ఆగిపోదు
పయనించును కలకాలం...!

నేను నిన్ను గౌరవిస్త
సాటి మనిషిగానెపుడు
దేవున్ని నేనెపుడు
భక్తితోనే పూజిస్త
ముక్తి కొరకు ధ్యానిస్తా...!

దయ్యంగా నీ భావన
ప్రచారాలు ప్రగల్భాలు
ప్రార్థనంటే సమభావం
సంతోషం సర్వశుభం
విశ్వశ్రేయ పరమార్థం..!

పూజలన్నీ వ్యర్థమనే
అపచారపు ఏడుపులేల?
నీ సంస్కృతి నీకు గొప్ప
నా సంస్కృతి నాకు గొప్ప
ఉనికినేల ప్రశ్నిస్తవు?
ద్వంస రచన హింసలేల?

నా నేల ప్రార్థనాలయం
సత్యం శివం సుందరం
నా కాళ్ళక్రింది భూమి లాగి
నన్ను పూడ్చి సమాధి చేస్తున్నవు
నీ వారసత్వ కట్టడాల్లో
ఇటుక నేనైతినిగద
నా వారసత్వపు కళాకృతుల
పునాదులేల పెకిలిస్తవు?

ఏది గెలుపు ఏది బలుపు ?
ఏది సత్యం ఏది పైత్యం ?
ఏది మంచి ఏది చెడు ?

చరిత్ర చెప్పెడి నిజాలు
పుటలు తెరువు కనబడతయి
విషలౌకిక నీ కోరలు
నాస్తికత్వ నడవడికలు
బుద్ధిని కాటేస్తున్నయి
భూమిని కబళిస్తున్నయి...!

అంతరంగ మనోరథం
బానిసత్వ భ్రమలో పడి
స్వేచ్ఛ శీల సౌభాగ్యం. !
అవసరాల అనుభూతిలో
కుడితిల బడ్డెలుకలోలె
కుహనా కుట్రలకు బలిగ
సాగిపోతూ చతికిలబడి
సాగుతున్నదీ నైజం
స్వార్థం వీడె వైనం
మానవతకు దారియిదా
దానవతకు పరాకాష్ట..!

ఏమయినా ? ఏదైనా ?
పరిస్థితిదే పరిణామం
కాలానిదే తుది న్యాయం!
ఆలోచన బాగున్నా
నోట మాటలెన్నున్నా
ఆచరణం మానవతం
అదే మనకు పరమార్థం...!



-డా.పాండాల మహేశ్వర్
9912180054

## లోగుట్టు

నాకు రాచరిక పాలన కీ
ప్రజాస్వామ్య పాలన కీ
తేడా తెలియటం లేదు.

వాళ్లు కనిపించే నియంతలు
వీళ్లు కనిపించని నియంతలు
అంతే తేడా.



-వి.సూర్యారావు
92469 11234

## నానీలు

నాన్న
భరిస్తూ మురిపించాడు
కన్నీళ్లను
ఆనంద భాష్పాలుగా.

నాన్న
ఉరుముల ఉరిమినా
నీ జీవితంలో
వెలుగు నింపేందుకే.

నా కలము
కదులుతుందంటే
నాడు
నాన్న పెట్టిన అక్షర బిక్షే.

బాల్యంలో నాన్న
చిటికనవేలే నీకు అభయం
వృద్ధాప్యంలో
ఏది నీ ఊతం.

నాన్న అలుపు ఎరగని
కష్టజీవి
సూర్యచంద్రుల్లా
నిత్యం.

నాన్న హలం
పట్టనివ్వలేదు
తనలాగా
కష్టాల కొలిమిలో పడొద్దని.

నాన్న నన్ను
భుజాలపై మోసాడు
జీవితంలో
బాధ్యతలు భారం కావని



-చాపల మహేందర్
949864152

## అవినాభావం ...

జీవరాశిలో మానవాళి ఉన్నతం
ఉత్తమ జన్మకు ఉభయులు మూలం
తప్పక మనము తలుచుట భావ్యం
మాతృదేవో భవ .. పితృదేవోభవ...

సన్మార్గమునకు జ్ఞానమార్గం
విజ్ఞానం వేవేకం వివేచనం ...
ఎందరెందరో మార్గనిర్దేశకులు
వారందరికీ వందనాలు ...గురుభ్యోన్నమః

నిత్యావసరాలకు నిజ దేవాలయం
సుందరమైన సభ్య సమాజమే...
కోట్ల జనాభాకు కొసిరి అందిస్తున్న
జైకిసానుకు జన్మంతా వందనాలు ...

సుబ్బరంగా తిని నిబ్బరంగా నిదురించ...
నిశ్చింతలే ... దేశ ప్రజలందరికి ....
కంచెలందే కన్నోళ్లను కట్టుకున్నోళ్లను
కనిపెంచిన పిల్లల్ని చూసుకుంటున్న
జైజవానుకు నిండా నూరేళ్లు ....

జీవన గమనపు రహదారంతా
ప్రత్యక్షమో ... పరోక్షమో ...
లెక్కలేనంత మంది వద్ద
ఫలితం పొందిన ప్రతి క్షణం
సుఖమయమయ్యే సుందరం ....

నీతి నిజాయితీలను హత్తుకుని
ధర్మం చూపే అడుగుజాడలలో
న్యాయం చెప్పే సూచనలతో
నలుగురు మెచ్చే నడకలతో
సమాజం కోసం మనం ...
మనకోసం సమాజమైనప్పుడే ....
అవినాభావం ..



-నగునూరి రాజన్న
8332963129

## సముద్రం- నూనె బుడగ

(కథ)

సముద్రం అలలతో ఎగిసి పడుతోంది. తనలో అన్నిరకాల జీవులు జీవిస్తున్నాయి. ముత్యాలు, రత్నాలు, పగడాలు అన్ని తన కడుపులో నుంచే ఉద్భవిస్తాయి. దేన్నైనా తనలో కలిపివేసుకుంటుంది. ఎంత పెద్ద వస్తువైనా సముద్రంలో మునిగి పోవాల్సిందే. ఆకాశాన్నంటే శిఖరమైనా సముద్రంలో నిలబడితే ఆనవాలు లేకుండా పోతుంది. లావా వెదజల్లే అగ్ని పర్వతమైన సముద్రం దగ్గర కొస్తే నోరు మూసుకుని కుర్చోవాల్సిందే. ఎంత పొడుగున్న చెట్టైన సముద్ర లోతులో ఉక్కిరి బిక్కిరవ్వాల్సిందే.

ఇవన్ని చూసుకొని సముద్రానికి గర్వం పెరిగి పోయింది. ఈ విశాల విశ్వంలో నాలో మునిగి పోనిది ఏది లేదు అని అనుకుంటుంది. ఒకరోజు భూమితో మాట్లాడుతున్నపుడు తన గొప్పదనాన్ని చూపించింది. 'నువ్వో చిన్న మట్టి బెడ్డవి. నీకూ చుట్టూతా నేనే ఆవరించి ఉన్నాను. అనంత విశ్వంలో మూడు వంతులు నేనుంటే కేవలం ఒక్క వంతు మాత్రమే నువ్వున్నావు అంటూ చులకన చేసి మాట్లాడింది.

భూమాత కు సహనం ఎక్కువ కదా! నవ్వి ఊరుకుంది భూమి నువ్వు చూసి సముద్రానికి అహం దెబ్బ తిన్నది. ఏమిటి భూమి, నా గొప్పదనాన్ని చూసి భూమి భయపడకుండా నవ్వుతుంది.

" ఏంటి నవ్వుతున్నావు, నా గొప్పదనం చూస్తావా?" అంటూ కొద్దిగా ముందుకు వచ్చి చూపించింది చూశావా! నేను వచ్చేశానంటే నువ్వు మునిగి పోయినట్లే నేను అనుకున్నానంటే నిన్నూ ఒక్కక్షణంలో ముంచేస్తాను నేను దేన్నైనా మునిగేలా చేయగలను అంటూ కాలుదువ్వి మీది మీది కొచ్చింది.

అయినా భూమి ఏ మాత్రం తొణకలేదు బెణక లేదు. చిరునవ్వు చెదరనూలేదు. " సముద్రమా! దేన్నైనా మునిగేలా చేస్తాను అంటున్నావు గదా! నన్ను కూడా క్షణంలో ముంచేస్తానన్నాను గదా! నన్ను తర్వాత ముంచేద్దువు గానీ. నేనొకర్ని పంపిస్తా ముందు వాళ్ళని ముంచేసేయ్ చూద్దాం అన్నది భూమి.

సముద్రం పెద్దగ పగలబడి నవ్వింది. నాకే పరీక్ష పెడుతున్నావా? నాతోనే పరాచికాలా? ఎవర్ని పంపిస్తావో పంపించు నా ముందు ఎవరైనా తల వంచాల్సిందే. నేనేలా ముంచేసానో చూడు" అన్నది సముద్రం.

భూమి "పంపిస్తాను ఎలా ముంచేస్తావో చూస్తాను" అంటూ ఒక నూనె బిందువును సముద్రంలోకి పంపింది. ఆ నూనె బుడగ సముద్రం మీద తేలుతూ వెళుతోంది.

సముద్రం బుడగను చూసి విరగబడి నవ్వి ఏదో కొండనో కోనసో పంపిస్తావనుకుంటే ఇంత చిన్న నూనె బిందువును పంపుతావా ఇప్పుడే ముంచేస్తానంటూ సముద్రం అలల్ని పెంచింది కానీ నూనె బిందువు మునగలేదు.

ఇంకా పెద్ద అలల్ని తెచ్చింది. ఇంకా పెద్ద పెద్ద అలల్ని తెచ్చింది. కానీ నూనె బిందువు మునిగి పోలేదు. సముద్రానికి పంతం ఎక్కువై నీళ్ళను ఎత్తున లేపి బిందువు మీద పోసినా అది మునగట్లేదు. ఎంత సేపు ప్రయత్నించినా నూనె బిందువు తేలుతూనే ఉన్నది. సముద్రం నూనె బిందువును కిందికి తోస్తూనే ఉంది. చివరికి సముద్రం అలసిపోయింది. కానీ నూనె బుడగ మునగలేదు. నీళ్ళపై తేలుతూనే ఉంది.

నీతి: ఎంత బలవంతుడైనా అన్ని పనులూ చేయలేరు.



-డా॥కందేపి రాణీప్రసాద్
98661 60378

## నమ్మకం-విశ్వాసం




ఒక మామూలు రైతు తనకున్న, ఇద్దరి కుమారులను ఎంతో కష్టపడి/ ఇష్టపడి ఉన్నత చదువులు చదివించి, బ్యాంక్ లోన్ తీసి, విదేశాలకు పంపాడు. వారు అమెరికాలో మంచి లాభదాయకమైన ఉద్యోగాలు చేస్తున్నారు. పెళ్ళిల్లు చేసుకొని స్థిరపడ్డారు కూడా. కొత్తలోరెండు మూడు సంవత్సరాల కొకసారి వారిని చూడవచ్చి వెళ్లే వారు ఆ తరువాత రావడవమే మానేశారు. ఆర్థికంగా బాగ స్థిరపడ్డారు కూడ, ఎన్నిసార్లు తమ పిల్లలు తమను అమెరికాకు రమ్మన్నా ఈ రైతు దంపతులు వెళ్ళలేదు.

అయితే ఉన్న ఊరులోనే అన్ని వసతులు కల్పించి తమ తల్లిదండ్రికి ఏ లోటు లేకుండా ఉంచారు తమ పిల్లలు. కాని ఆ వృద్ధ దంపతులైన శ్రీమతి నమ్మకంకు అలాగే శ్రీ విశ్వాసంలకు మాత్రము సంతృప్తిగా లేదు. అలా దాదాపు పాతికేళ్ళు గడిచిపోయాయి. ఆ వృద్ధ దంపతులు శారీరకంగా పూర్తిగా క్షీణించి తమ పనులు కూడా తాము చేసుకునే స్థితిలో లేని దీన స్థితికి వచ్చేశారు. అక్కడ విదేశాల నుండి తమ కొడుకులు వారి బాగోగుల కోసం ఇబ్బడి ముబ్బడిగా డబ్బులు పంపిస్తున్నారు. కానీ, ఒక్కసారైనా వచ్చిచూసిన పాపాన పోలేదు. ఇంటినిండా పనివాళ్ళు ఉన్నారు. కాని తమ కడుపున పుట్టిన వారి ఆత్మీయపు అనురాగపు స్పర్శకై రాత్రింబవళ్ళు తహతహలాడిపోతున్నారా వృద్ధులు. ఎప్పుడూ ఏదో ఒక రోగంతో బాధ పడేవారు. వారి చికిత్స కోసం ఎన్నిరకాల వైద్యం చేయించినా మరే మానసిక ఆనందపు కార్యక్రమాలు కూడా వారిని ఊరడించలేకపోయాయి వారికి.

ఆ ఇద్దరు వృద్ధ దంపతులు ఒకరికి ఒకరు నమ్మకం విశ్వాసం. భార్య నమ్మకంకు ఒంట్లో బాగుండడం లేదు. ఆ ముసలమ్మ ప్రతి రోజు ఒక తల్లిగా తన తనయుల కోసం పరితపించేది. ఒకనాటి అర్థరాత్రి తన కొడుకులు ఏదో రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్టు కలగని ఒక్కసారిగా కేకవేసి మంచంపై నుండి నేలపై పడిపోయింది. ఆ అలికిడికి నిద్రలేచిన భర్త విశ్వాసం తన భార్యను లేపడానికి చేసిన ప్రయత్నంలో తాను ఆమె మీద పడిపోయాడు.

ఇది గమనించిన తన భాగస్వామిని అతికష్టం మీద తనను పక్కకు తీసి "ఏమయ్యా విశ్వాసం! ఇలాపడిపోయావేంటయ్యా" అని భిగ్గరగా కేకవేస్తూ అతని పక్కకు తోయ ప్రయత్నిస్తోంది.

ఈ కేకలు విన్న పనివాళ్ళు ఒక్కసారిగా అక్కడికొచ్చి చూసి ఆశ్చర్యపోయి వారిద్దరినీ లేపి మంచాల్లో పడుకో బెట్ట ప్రయత్నించారు. కానీ పెద్దాయన విశ్వాసంలో కదలిక లేదు ఉలుకూ పలుకు లేదు. ఇక పెద్దావిడ నమ్మకం నోటిమాటరాక తొత్తురుపోతోంది. తీరా చూస్తే తనకు పక్షవాతం సోకిందని అర్థమైంది. వెంటనే వారి ఫ్యామిలీ డాక్టర్‌ను పిలిపించారు. డాక్టర్ పరీక్షించిన "పెద్దాయన పోయారని, పెద్దావిడ కూడా మెరుగైన వైద్యం చేయి చేస్తే గాని మనకు దక్కరని" చెప్తూ ఈ విషయం కొడుకులకు ఫోన్ ద్వారా చెప్పి నమ్మకమమ్మను హాస్పిటల్‌కు తరలించారు. వైద్యం చేస్తుండగానే ఆ నమ్మకం కూడా విశ్వాసాన్ని చేరుకుంది.

నమ్మకం విశ్వాసంతో ఇద్దరి మృతదేహాలను తమపిల్లలు వచ్చేంత వరకు భద్రంగా ఉంచారు. అయితే వాళ్ళు విదేశాల నుండి వచ్చే మూడు రోజుల వరకు అంత్యక్రియలకు వచ్చిన బంధు మిత్రులందరూ తలో రకమైన మాటలు అంటున్నారు. ఒకరేమో అవసరానికి ఆదుకొన కొడుకులు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటీ అని.."

మరొకరు "కోట్ల ఆస్తిపాస్తులు ఉంటేనేమి అవన్ని తీసుకెళ్తామా ఏంటీ?" అని

"పాపం ఎంతో కష్టపడి పిల్లలకు విద్యా బుద్ధులు చెప్పిస్తే చివరికి మిగిలింది ఇదా! అయినా పిల్లల్ని చుక్కలనందుకొనేంత గొప్ప చదువులు చదివిస్తే ఇదిగో ఇలాగే ఉంటుంది" అని.

మరొక మామూలు ఆవిడ కల్పించికుంటూ "ఒకవేళ చదివించినా మనకు అనుకూలంగా ఉండీ, మనకు అందుబాటులో ఉండి, తమను కన్న వృద్ధ దంపతులకు తాము దగ్గరుండి సేవజేసి తమ మాతృభూమికి అంకితమై జన్మభూమిలో ఉండే చదువులు మాత్రమే చదివించాలి" అని తనేదో అంటోంది.



-దారం గంగాధర్
సెల్:9848384777

## మడత మంచం..

జ్ఞాపకాల పొదరింట్లో అందంగా అమరిపోయి
అపురూపంగా దాచుకున్న తియ్యటి అనుభూతి మడత మంచం.

తనదైన ప్రత్యేకత చాటుతూ
తనకంటూ ఓ చోటును చూసుకొని ..
చూపరుల కనులకు హుందాను చాటుతూ
ఇంటి యజమానికి ఓ గుర్తింపు నిస్తూ.

పిల్లలకు ఆటవిడుపై చావడిలో చేరి సందడి చేస్తే
తాను కిర్రు కిర్రు మని ఆ సవ్వడికి వంతపాడుతూ
పడుచు జంటను మల్లె పందిరి కిందికి తీసుకెళ్లి..
వారి సిగ్గు దొంతరల మధ్య కిలుక్కున నవ్వుతూ

అతిధి దేవో భావా అంటూ
వచ్చిన చుట్టానికి పట్టమంచంలా తలపింప చేస్తూ
చిన్న అర్రులలో ఒద్దికగా అమిరిఉండే తలలో నాలిక..
మా మడత మంచం.

చివరి మజిలో తాత కు ఊయల మంచంలా మారి
తాత దగ్గులకు తందదానా తానే తందదానా అంటూ..
ముచ్చటకు ఊతం ఇస్తుంది..



-ఉదయశ్రీ ప్రభాకర్
9866687134

## పల్లెని పచ్చగుంచుదాం

పల్లె పచ్చగుండేది
పదేండ్ల కింది దాక
పల్లె మసితో నిండి
మసక బారుతోంది
మత్తుతో ఊగుతోంది
ఊరంతా గుప్పుమంటున్న
ఉలికిపాటు ఎవ్వరికీ లేదు
ఎందుకంటే ఊరు ఊరంతా
మత్తులోనే జోగుతోంది

అవ్వ అయ్య అంటే
పానం ఇచ్చే పోరగాల్లు
గాళ్ళ మాటింటే ఒట్టు
ఎందుకంటే ఊరు ఊరంతా
మత్తులోనే జోగుతోంది
పెద్దోళ్ళంటే మర్యాదతో
విలువిచ్చే పోరగాల్లు
గాళ్లను దేకుతే ఒట్టు
ఎందుకంటే ఊరు ఊరంతా
మత్తులోనే జోగుతోంది

ఏడ నుండి ఏడికి జేరుతుందో
దేశపు ఎన్నెముక ను
నుసి నుసి జేసేస్తుంది
పడుచు పిలగాండ్లను
పాడు పాడు జేస్తుంది
ఆనికి తెల్వకుంట
ఆడు అలవాటయ్యి
ఆగమయిపోతండు
ఆని మెదడు ఆని ఆజ్ఞల
లేకుంట అయితండు
మెదడునే జొచ్చి మెలిపెట్టి
నరాలను జంపి నులిపెట్టి
నాశనం జేస్తుంది "మత్తు"

గ్రామాలను కాదు దేశాన్ని
దేశ శక్తి నీ.... యువ శక్తినీ..

( పల్లెలని చేరి యువతను చిత్తు చేస్తున్న మాదక ద్రవ్యాల వ్యాప్తికి ఆందోళనగా)



-సాకి
9951172002

